కథ

# బడోంకి ఈద్


బా రహమతుల్లా

**ఈ రోజు మురదోంకి ఈద్, పెద్దల పండగ.**

**ఈ ఉదయాన్నే కొత్తపట్నం ఇసుకలో బస్సు దిగి కాలు మోపాను.**

**సముద్రగాలి చల్లగా, ఉప్పగా నా శరీరాన్ని, నా హృదయాన్ని తాకింది. నాకు హాయిగా అన్పించకపోగా విపరీతమైన దిగులు, భయమూ కలిగాయి.**

**లక్ష కరీమున్ జ్ఞాపకాలు ఝుమ్మని చుట్టుముట్టాయి.**




**నా లోపటి ఆలోచనల కందిరీగల తుట్టి కదిపినట్లయింది. అవి వెంటాడుతుంటే, వేటాడుతుంటే వాటి వెంటపడే ధైర్యం లేక, వాటి నుంచి తప్పించుకోలేక వడివడిగా కరీమున్ లేని కరీమున్ ఇంటిని చేరాను.**

కరీమున్ నా చెల్లెలు. ఆమె కొడుకు ఫయాజ్‌ను సముదాయించి మా ఇంటికి తీసుకుపోవాలి. వాడు నామీద అలిగి ఉన్నాడు. అలిగితే వాడు మహామొండిఘటం. అస్సలు మాటే వినడు. ఈరోజేమో బడోంకి ఈద్, గతించిన వారిని స్మరించే దినం. బక్రీద్ ముందు రోజు జరుపుకునేది. మా అమ్మిచ్చే ఈ పండగ రోజుటి ఫాతియాల్లో వాడి చేత వాడి అమ్మ కొరకు ఊద్దాన్‌లో ఊదు వేయించాలి. క్రి ఆత్మ (రూహ్) చల్లబడి, ఆమె స్వర్గం చేరాలి. వాడిని మా ఊరు సంతనూతలపాడుకు రమ్మనమని ముందుగానే కబురంపాను. వాడేమో వాడి నాన్న కరీముల్లాలాగా చీటికి మాటికి అలుగుతుంటాడు. అలక వాళ్ళ నాన్న నుంచి వాడికి వారసత్వంగా వచ్చింది. నవ్వితే వాడి బుగ్గమీది అందమైన సొట్ట మా చెల్లెలు నుంచి వచ్చింది. రంజాన్, బక్రీద్, మొహరం ఈ మూడు పండగలకు తప్పకుండా నేను ఉద్యోగం చేసే హైదరాబాదు నుంచి నూతలపాడుకు పోతాను. పండగలకన్నా మా అమ్మ రొఖయా, నా మేనల్లుడు ఫయాజ్‌లను కలవటం కొరకే ప్రధానంగా పోతాను. వాళ్ళిద్దరిని ప్రేమగా చూసుకోవటం, వారికి కావలసినవి చూడటం నాకు ఎంతో ఇష్టం. అంతేకాదు అది నా ముఖ్యమైన బాధ్యతగా భావిస్తుంటాను. మా అందరి ప్రేమాభిమానాలు లేకుంటే ఫయాజ్ మానసికంగా ఎంతో కుంగిపోయి ఉండేవాడు. పోయిన నెల్లోనే వాడి పదవ తరగతి ఫలితాలు వచ్చాయి. వాడికి చాలా మంచి మార్కులొచ్చాయి. నేను కంగ్రాట్స్ చెప్పలేదు. పోయిన నెల్లోనే వాడి పదిహేనవ పుట్టినరోజు వచ్చింది. దానికీ నేను శుభాకాంక్షలు చెప్పలేదు. ఈ రెండు నెపాలు నామీద వేసి వాడు ఈ పండక్కు రావటంలేదని నాకు తెలిసింది. అందుకని నేనే కొత్తపట్నం బయలుదేరివచ్చాను. ఒక పుష్కరానికి ముందయితే కొత్తపట్నం వెళ్ళటం నాకు మహా సంబరం. నాకు ఇష్టమైన సముద్రాన్నేకాక నేను ఎంతో ప్రేమించే నా చెల్లెలు కరీమున్‌లను చూడొచ్చు. ఇప్పుడు ఆ ఊర్లో సముద్రమైతే ఉంది కాని నా చెల్లెలు కరీమున్ లేదు. సముద్రాన్ని చూస్తేనే నన్ను విషాదం ఆవరిస్తుంది. మా చుట్టాల్లో ఒక మాంచి కుర్రోడ్ని చాలాకాలం క్రితం నా కండ్లముందే సముద్రం మింగేసింది. విషాదం అందువలన కాబోలు. అయినా సముద్రం ముందు కూర్చుని నా లోపటి దిగుళ్ళను అలా చూస్తూంటాను. విచిత్రంగా మనస్సు హాల్కా అయిపోయినట్లు అనిపిస్తుంది. కాని కరీమున్ లేని కొత్తపట్నం సముద్రం చూడటం నాకు అసాధ్యమనే అనిపించింది. అందుకే ఈ పది, పన్నెండు సంవత్సరాలలో ఒక్కసారి కూడా కొత్తపట్నం రాలేదు. పండక్కు పబ్బానికి ఫయాజ్‌నే రప్పించుకునేవాడిని. ఇప్పుడేమో నేను రాక తప్పలేదు. కరీమున్‌తో నాకు రక్తసంబంధమేకాక ఎంతో బలీయమైన అనుబంధమూ ఉంది. నా కొడుకు మేరాజ్‌ను చిన్నప్పుడు ఒక మూడు సంవత్సరాలు కంటికి రెప్పలా సాకింది. కుక్కల్ని, కోతుల్ని, కాకుల్ని, పిచ్చుకల్ని చూపించుకుంటూ, వాటికి కొన్ని అన్నం మెతుకుల్ని వేసుకుంటూ యమ న్యాక్‌గా మేరాజ్‌కు అన్నం తినిపించేది. ఇంటి ముంగటి వాకిట్లో, బజాట్లో గంటసేపు ఓపికగా తిరుక్కుంటూ గోరుముద్దల్ని గటుక్కున మింగించేది. అదంతా చూస్తున్నప్పుడు నాకూ ఒక కూతురు లేకపోయెనే అని ఎన్నోసార్లు లోటుగా అన్పించేది. సహజంగానే ఆడపిల్లల ఆత్మీయత, మనల్ని పట్టించుకునే తత్వం మహా అద్భుతం. ఆమె కొడుకు ఫయాజ్‌ను కూడా ఆమె మూడు సంవత్సరాలే చూసుకో గలిగింది. మేరాజ్, ఫయాజ్‌లను ఆమె చూసుకునే విధానం, లాలించే పద్ధతి చూసి అల్లాతాలా నన్ను కూడ ఆ పిల్ల కొడుకుగా పుట్టించి ఉంటే ఎంత బాగుండునో కదా అని అనిపించేది. లేదంటే ఆ అమ్మాయి నాకు కూతురుగానో, నాకు తల్లిగానో ఉండి ఉన్నా గొప్ప అదృష్టమే అని

అన్పించేది. కర్రి చూట్టానికి ఒక చిన్నపిల్లలా, తెల్లటి పావురంలా కనిపిస్తుంది కాని, ఆమెలో ఏదో శక్తి ఉన్నది. ఆమె లోపట ఏం జరగాలనుకుంటదో అదే జరుగుతుంది. ఒక అర్ధరాత్రి నా భార్యతో ఏదో పెద్ద గొడవపడి, విపరీతమైన కోపంతో ఇల్లు వదిలి శాశ్వితంగా ఎటన్నా వెళ్ళిపోవాలని ప్యాంటూ అంగీ తొడుక్కుని బయలుదేరాను. ఒక్కమాటన్నా మాట్లాడలేదు, కాని బేలముఖం వేసుకుని, కండ్లలో నీళ్ళు నింపుకుని నా ఎదురుగ్గ కరీమున్ నిలబడింది. అంతే, నోర్మూసు కుని తొడుక్కున ప్యాంటూ అంగీ తీసేసి, తిరిగి లుంగీ చుట్టుకుని మంచం ఎక్కేసి, దుప్పటి కప్పేసుకుని పడుకుండిపోయాను. ఆ పిల్లను అంత కోపంలోనూ ఒక్క మాటన్నా అనలేకపోయాను.

ఒకసారి నేను మా హెడ్మాస్టరి ఇంటిలో ఉన్నప్పుడు వచ్చి "తాత చనిపోయాడు. అమ్మ రమ్మంటున్నది" అని చెప్పి ఏడ్చుకుంటూ వెళ్ళిపోయింది. చిన్నప్పటి నుంచీ నాకూ, ఆ పిల్లకు ఎక్కువ మాటలు ఉండేవి కావు. ఎప్పుడన్నా ఇటువంటి కొన్ని మాటలు తప్పించి, మా ఇద్దరి మధ్య పది సంవత్సరాల దూరమున్నందున కాబోలు. అయినా ఆ కొన్నికొన్ని మాటలే నన్ను ఇప్పటికీ వెంటాడి సతాయిస్తూ ఉంటాయి. ఆ పిల్ల హావభావాలూ మనస్సులో మెదులుతూ కకావికలం



**ఆ పిల్ల జీవితం చాలా చిన్నది, ఎంతో సాదాసీదాది. పద్దెనిమిదో ఏటే నిఖా జరిగింది. పిలగాడు కరీముల్లా సాంచ్‌బార్ నమాజీ. మంచి ఖాన్‌దాన్ సంబంధం. ఊరు కొత్తపట్నం. మా నూతలపాడు నుంచి ఇరవై మైళ్ళ దూరం. అత్తగారోల్లు చాలా మంచివాళ్ళు. బాంకులో వాళ్ళు వేసిన డబ్బులకు వడ్డీ కట్టి ఇవ్వొద్దని బాంకుకు కాగితం రాసినవాళ్ళు. డబ్బాశ లేని సాంప్రదాయ కుటుంబం.**

చేస్తూంటాయి. ఆ పిల్ల రూపం స్వచ్ఛంగా నవ్వుతూ, నా లోపట కాంతిపుంజంలా కదలాడుతుంది. బాధ మాత్రం యమ నరకంలా తరుముతుంది.

***

ఆ పిల్ల జీవితం చాలా చిన్నది, ఎంతో సాదాసీదాది. పద్దెనిమిదో ఏటే నిఖా జరిగింది. పిలగాడు కరీముల్లా సాంచ్‌బార్ నమాజీ. మంచి ఖాన్‌దాన్ సంబంధం. ఊరు కొత్తపట్నం. మా నూతలపాడు నుంచి ఇరవై మైళ్ళ దూరం. అత్తగారోల్లు చాలా మంచివాళ్ళు. బాంకులో వాళ్ళు వేసిన డబ్బులకు వడ్డీ కట్టి ఇవ్వొద్దని బాంకుకు కాగితం రాసినవాళ్ళు. డబ్బాశ లేని సాంప్రదాయ కుటుంబం. పెండ్లికి దుబారా ఖర్చులు వద్దని, బాజాభజంత్రీలు వద్దని, ఫోటోలూ వీడియోలూ తీయకూడదనీ, లేన్‌దేన్ గురించి ఆలోచించకూడదనీ, ముందుగానే షరతులు పెట్టిన నిజమైన ఇస్లాం విశ్వాసులు. నిఖానాడు వాళ్ళంతా ఒక లారీనిండుగా ఉదయాన్నే దిగారు. నాస్తాలు, రసమాగే అయ్యాక మా ఇంటి ముందు వేసిన టెంట్‌లోకి వచ్చి కూర్చున్నారు. సరిగ్గా అగడ్ అయిపోయాక, బంధుమిత్రులంతా దావత్ చేస్తున్నప్పుడు మా ఆడవాళ్ళంతా మా చెల్లిని ఒకటే తిట్టుడు. "మేము ఎన్నిసార్లు చెప్పాంమే నీకు, చాటలో రాళ్ళు ఏరుతున్నప్పుడు బియ్యం గింజలు నోట్లో వేసుకోబాకు అని. విన్నావ... ఇప్పుడు చూడు వర్షం ఎంత దుమ్ముదుమ్ముగా కురుస్తున్నదో" అతిథులకు అసౌకర్యం కాకుండా మా నాయిన, అన్నయ్య, నేను, మా తమ్ముడు వానలోనే టెంటులో నీళ్ళు నిలవకుండా తట్టల్తో అంపవు పొట్టు, ఇసుక మోసుకొచ్చి పోస్తున్నాం. వర్షంలోనే మాకు చెమటలు పడుతున్నాయి కూడా. 'కరీమున్ అంటే వీళ్ళందరికీ ఎంతిష్టమో' మమ్మల్ని చూస్తూ అనుకుంటున్న వాళ్ళ మాటలు మా చెవిన పడుతున్నాయి. అందరి భోజనాలూ, పెండ్లి పనులూ పూర్తయ్యేసరికి మా దేహాలు ఖీమా కింద కొట్టినట్లు అయిపోయాయ్.

జుల్వా అయిపోయాక, విడిది ఇంటినుంచి కరీమున్‌ను లారీ క్యాబిన్‌లో ఎక్కించుకుని తీసుకునిపోతుంటే ఆ లారీ చుట్టూనే ఏదో పనున్నట్లు తిరుగుతూనే ఉన్నాను. లారీ కదిలిపోతుంటే, కర్రి కండ్లల్లో దిగులు చూసి ఉండబట్టలేక లారీ ఎనక ఎక్కి నిలబడి మా ఊరి పొలిమేర దాటేంత వరకు పోయి, లారీ దూకి, కిందబడి, లేచి తిరిగి వచ్చేసాను.

పెండ్లిలో వాళ్ళ మాటతీరు, ప్రవర్తన చూసాక కరీమున్ జీవితం ఆనందంగా సాగుతుందని ఎంతో సంబరపడిపోయాను. అనుకున్నట్లుగానే కరీమున్ జీవితం ఓ మూడు సంవత్సరాలు ఎంతో సంతోషంగా గడిచింది. అంత ఖుషీగా ఉన్నందుకు ఏమన్నా దిష్టిలాంటిది తగిలిందేమోనని, కరీమున్‌కు అప్పుడప్పుడు భయమేసేది. ఇంత సంబరం ఇలా జీవితమంతా సాధారణంగా సాగదని ఆ పిల్ల అభిప్రాయం. అందుకే ఏదన్నా ఉపద్రవం వాళ్ళ జీవితాల్లో వస్తదేమోనని అంతగా ఆనందించటానికి కూడా భయపడేది.

అత్తారింట, ఇరుగుపొరుగు వారిలో మంచి పేరు తెచ్చుకుంది. మామగారయితే కరీమున్ వడ్డిస్తేనే అన్నం తినేవాడు. తండ్రీకూతుర్ల సంబంధం అయిపోయింది. కరీముల్లా అప్పుడప్పుడు అలిగి జమాతుల్తోనో, దేశం మీద పడో ఇల్లు విడిచి పోయేవాడు. అత్తమామలు తల్లిదండ్రుల మాదిరి కరీమున్‌ను సముదాయించే వాళ్ళు. తిరిగొచ్చిన కొడుకును చూసి సంతోషపడక ఈ అమ్మాయి బెంగపెట్టుకోవటానికి కారణం అయినందుకు కొడుకునే యమ తిట్టేవాళ్ళు.

"మామయ్యా! నువ్విట్ల పాగల్ దునియాలాగ ఎక్కడో ఆలోచనల్లో ఉంటే నీతో అస్సలు రాను. నేను బయటకు వెళ్ళిపోతున్నాను, పో..." అని ఫయాజ్‌గాడి బెదిరింపు మాటలు విన్పించేసరికి కరీమున్ దునియా నుంచి బయటపడి వాడి వైపు చూసాను. వాడిని ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి వాడిని తీసుకుని ఊర్లోకి బయలుదేరాను. వాడిని నాతో రావటానికి ఒప్పించాలి.

వాళ్ళ అమ్మ గురించి మాట్లాడుకుంటూ ఒక చిన్న హోటల్లోకి పోయాం. అక్కడి హోటళ్ళన్నీ ఇండ్లలోనే ఉంటాయి. చెరో రెండు దోసెలు తిన్నాం. సరిగ్గా ఆ రోజు కూడా ఇదే హోటల్లో కరీముల్లాతో దోసెలు తిన్నాను. చావులు, దిగుల్లు, దుఃఖాలు ఏవీ తినటాన్ని ఆపలేవు. కరీమున్ శవం ఇంటిముందు పడుకుని ఉంది. ఆ

పిల్లను ఎంతో అమితంగా ప్రేమించే మేమిద్దరం దోసెలు తిన్నాం. ఎంతో అపరాధ భావన కలిగింది అప్పుడు. కాని ఆకలి మహారాక్షసి కద. "ఒరేయ్! మీ అమ్మ ఎట్లా ఉండేదో నీకు గుర్తున్నదా? పచ్చగా బంగారుబొమ్మలా ఉండేది. దేవుడు స్వచ్ఛత మాత్రమే కలిపి ప్రాణం నింపినట్లు జీవంతో తొణికిసలాడుతుండేది. మీ అమ్మను చూస్తేనే ఎవరికైనా అనురాగం, ఆత్మీయత కలిగేవి. ఆడపిల్లంటే ఇట్లుండాలి అనిపించేది. చిన్నప్పుడు బుగ్గన కాటుకతో మా అమ్మ మీ అమ్మకు దిష్టిచుక్క పెట్టినట్టుంది. ఇలా జరగరానిది జరిగిపోయింది. అలా అవుతుందని ఎవ్వరం అనుకోలేదు. కలలో కూడా ఊహించలేదు. నీ కొరకు అలా జరక్కుండా ఉండటానికి మీ అమ్మ విపరీతంగా పెనుగులాడింది. అయినా ఓడిపోయింది. మేము సైతం ఎంతో అండగా ఉన్నాం. అయినా గెలవలేకపోయింది. చావుని గెలవటం అసాధ్యం. మనిషి శక్తి చాలా పరిమితం రా. అందుకే మనుషులు దేవుడ్ని నమ్మేది" అలా మాట్లాడుకుంటూ మశీదు, ఖబరస్తాన్ ఉన్నవైపు చిన్నగా నడుస్తున్నాం. మా నాయిన నూతలపాడులో కిరాయికి ఎద్దుబండి తోలేది. మేమంతా ఆ ప్రకారంగా రఫ్ అండ్ టఫ్‌గా ఉండేవాళ్ళం. మా అమ్మ, మా చెల్లెలు మాత్రం ఎర్రగా బుర్రగా సుకుమారంగా కన్పించేవాళ్ళు. మా అమ్మకు మేము ఐదుగురం పిల్లలం. మా కరీమున్ నంబరు నాలుగు. కరీమున్‌తోసహా మేమంతా మా అమ్మమ్మ ఉండే



పూరిగుడిసెలోనే పుట్టాం. చీరాల్లో నాజ్ థియేటరు పక్కనే ఉండేది మా అమ్మమ్మ ఇల్లు. ఆ గుడిసె పక్కన ఒక పెద్ద బాదం చెట్టు, ఇంకో పెద్ద చీమచింతకాయల చెట్టు ఉండేవి. ఎండాకాలం సెలవుల్లో కరీమున్, మేము అందరం ఆ చెట్ల కింద ఆడుకునేది. మాకు ఎంతోమంది క్రిస్టియన్ దోస్తులు అక్కడే అయ్యారు. కరీమున్‌ను, మా అమ్మను కలిపి పరిశీలనగా చూస్తే కరీమున్ వయస్సులో, మా అమ్మ అచ్చం కరీమున్‌లా ఉంటుందని అనిపిస్తుంది. ఆ పిల్ల పుట్టినప్పుడు మంత్రసాని ఏమన్నదంటే "పిల్లల్ని కనటం భలే నరకం బుబమ్మా! కాని ఈసారి ఏ కష్టం లేకుండా నీ కూతురు నిమిషాల్లో పండంటి పిల్లను కనింది. అలా పుట్టిన ఈ పిల్ల మంచి అదృష్ట జాతకురాలు అవుతుంది" అన్నది మా అమ్మమ్మతో. కాని మంత్రసానికేం తెలుసు కరీమున్ ఎంత దురదృష్టవంతురాలో.

***


కర్రి చిన్నతనం మాత్రం బాగానే గడిచిపోయింది. ఏడవ తరగతి వరకు చదువూ బాగానే సాగిపోయింది. ఆ పిల్లలకు చదువంటే ఎంతో ఇష్టం. చాలా చురుకుగా ఉండేది. ఖురాన్ను అరబ్బీలో చదివే ఇస్లాం సాంప్రదాయాన్ని చాలా తక్కువ సమయంలో ఖతమ్ చేసింది. 'ఖురాన్ ఖతమ్' రసమాగిలో పంచిన లడ్డూ తింటూ, "ఈ పిల్ల చాకులాంటి పిల్ల. ఇట్టే ఖురాన్ చదవటం నేర్చేసుకుంది." మా మశీదు ఉస్తాద్ మా అమ్మతో అంటున్నాడు. లెక్కల్లో వందకు వంద మార్కులొచ్చేవి. ఎనిమిదో తరగతి చదవాలని ఎంతో అనుకుంది. అయినా ఇంట్లో ఎవ్వరికీ ఆ విషయము చెప్పనేలేదు. జీవితం ఎట్లా నడిస్తే అట్లా ఉండటమే ఆమెకు తెలుసు. ఏడవ తరగతి అయ్యాక తన పదమూడవ ఏట పెద్ద మనిషైంది. అంతే ఇంట్లో కూర్చోబెట్టేసారు. మా మశీదు బజారులోని అందరమ్మాయిల సంగతీ అంతే. పుష్పవతి అయ్యారంటే బడికి, బయటికి పొయ్యేది లేదు. బడి ఊకే గంగమ్మ ప్రతిరోజు ఇంటింటికి వచ్చి పిల్లల్ని బడికి పంపమని బతిమిలాడేది. ఇంటిముందు నిలబడి రమ్మనమని కేకలేసేది. ఎంత గీపెట్టినా ఆ గంగమ్మ మాట ఎవరూ వినకపోయేది. పైగా ఆమెతో ఊసుబోని ముచ్చట్లు పెట్టేది. మా చెల్లి. బడికిపోయినంత కాలం తోటి విద్యార్థినులంతా మా ఇంటికే వచ్చేది. అంతా కలిసి గుంపుగా పుస్తకాలు చంటిపిల్లోల్లను

**కరీమున్ సహేలీలు కోమటోల్ల పిల్లలు నాంచారమ్మ, రేణుకల చదువు ఆగిపోలేదు. రెడ్ల అమ్మాయి రమాప్రభ, కమ్మోల్ల పిల్ల నాగరత్నం, బాపనోల్ల అమ్మాయి లక్ష్మీదేవిల చదువు ఆగిపోలేదు. షకీల, షబీన, జరీన, అమీరున్, ఆసియా ఒకరని ఏంది అందరూ అంతే. సాయిబుల ఆడపిల్లలు పెద్దమనుషలైతే మా పెద్దమనుషులు వారి చదువులు మాన్పిస్తారంతే.**

ఎత్తుకున్నట్లు పట్టుకుని వయ్యారంగా పోతుండేది. ఆ దృశ్యం ఎంతో చూడముచ్చటగా కన్పించేది. కర్రి చదువును పదమూడో ఏటే మాన్పించి, పద్దెనిమిదో ఏటే పెండ్లి చేసేసారు.

కరీమున్ సహేలీలు కోమటోల్ల పిల్లలు నాంచారమ్మ, రేణుకల చదువు ఆగిపోలేదు. రెడ్ల అమ్మాయి రమాప్రభ, కమ్మోల్ల పిల్ల నాగరత్నం, బాపనోల్ల అమ్మాయి లక్ష్మీదేవిల చదువు ఆగిపోలేదు. షకీల, షబీన, జరీన, అమీరున్, ఆసియా ఒకరని ఏంది అందరూ అంతే. సాయిబుల ఆడపిల్లలు పెద్దమనుషలైతే మా పెద్దమనుషులు వారి చదువులు మాన్పిస్తారంతే. దీనికి కారణం పేదరికమో, మతమో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. ఈ పిల్లలంతా కలసి కోకో, కబడ్డి ఆడేవాళ్ళు. కర్రికి కోకో ఆటంటే ఎంతో ఇష్టం. కాని చదువు, ఆటల స్థానంలో ఇంటి పని, వంటపని చేరాయి.

"నమస్తే సార్! ఆయన మా మామయ్య సార్" అని ఫయాజ్ నన్ను వాళ్ళ ప్రయి వేటు సార్‌కు పరిచయం చేసేసరికి కరీమున్ జ్ఞాపకాల్లోంచి బయటపడి ఆ సారుకు నమస్కారం చేసాను. "మీ అల్లుడు చదువులో ఎంతో చురుకు. వాడిని పైచదువులు బాగా చదివించండి" అని ఆ మాటలు ఈ మాటలు మాట్లాడి వెళ్ళిపోయాడు. తిరిగి కర్రి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. నిఖా జరిగిన రెండేండ్లకు కరీమున్ కడుపున అల్లాతాలా వీడిని వేసాడు. వీడికి రెండేండ్లు వచ్చాక ముగ్గురూ కలసి మా ఇంటికి వచ్చారు. అప్పుడు మేము వరంగల్‌లో ఉన్నాము. అందరం కలసి జూకు పోయినాం. కరీమున్, కరీముల్లా, ఫయాజ్ ముఖాల్లో ఒకే ఆశ్చర్యం, ఆనందం కన్పించాయి. ముగ్గరికి ముగ్గరూ పిల్లల్లానే కన్పించారు. చెట్టు చిటారు కొమ్మ నుంచి ఇంకో చెట్టు కొమ్మ మీదికి దూకే కోతిని చూసినా, పురివిప్పిన నెమలి జలదరించినప్పుడు కనిపించే రంగురంగుల నెమలీకల సముదాయాన్ని చూసినా, గాల్లో గెంతులేస్తూ హుషారుగా, లయబద్ధంగా దుముక్కుంటూ దౌడులు తీస్తున్న జింకల గుంపును చూసినా, గాండ్రించుకుంటూ



**కర్రి చనిపోతానని తెలిసాక ఒక సంవత్సర కాలం బతికింది. ఆ సమయంలో ఎంత భయపడిపోయిందో, ఏమేమి ఆలోచించుకున్నదో ఆ అల్లాతాలాకే తెలియాలి. లేదా ఆ పూలమొక్కలకే తెలియాలి. వారానికి ఒక పూలమొక్క చొప్పున ఏడు వారాలు ఏడు మొక్కల్ని నాటింది. వాటికి ఫయాజ్, మేరాజ్, రొఖయా, కరీముల్లా, జంగ్లి, అత్తమ్మ, మామయ్య అని పేర్లు పెట్టుకుంది.**

కొట్లాడుకుంటున్న సింహాల్ని చూసినా, నీటికొలనులో ఈదుతున్నట్లే కనిపించకుండా గునగున ముందుకు సాగిపోయే తెల్లటి బాతుల్ని చూసినా వాళ్ళు ముగ్గురూ ఒకేలా స్పందిస్తున్నారు. వాళ్ళను చూస్తే సంతోషం అంటే వాళ్ళే అనిపిస్తుంది. స్వర్గం ముక్కల్లా ఉండి, వాటిల్లోనుంచి కదులుతూ సంచరిస్తున్న ఒక ముక్క వీళ్ళ ముగ్గురి రూపంలో ఉన్నట్లు అనిపిస్తుంది. అదే దృశ్యం కొంతకాలానికి మారిపోయింది. సృష్టి విచిత్రం అంటే ఇదే అనుకుంటాను.

కరీమున్‌ను చెన్నయ్ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. నేను పోయినప్పుడు అక్కడి దృశ్యం నరకం. ఆమెలో ఎక్కడా ఏమాత్రం జీవకళ కన్పించటంలేదు. పుష్టిగున్న పిల్ల పీనుగైపోయింది. ఆమె రెండు కండ్లు కన్పించకుండా అయిపోయినాయి. చర్మం మొత్తం కర్రిగా అయిపోయి కురుపులు కురుపులు ఉన్నాయి. బంగారంలాంటి చర్మం తుప్పుపట్టిన ఇనుములా అయిపోయింది. బొండుమల్లెలాంటి అమ్మాయి వికసించకముందే రాలిపడి, వర్షానికి తడిసి, ఎండకు ఎండి, నుజ్జునుజ్జుగా అయిపోయి చెత్తకుప్పలోకి కొట్టుకుపోయినట్లుంది. ఎప్పుడూ జర్వం ఉండేది. నేను డాక్టరును కలిసాను. "ఏమీ అర్థమైతలేదు, బాబూ... శరీరం లోపటి ఏ భాగమూ మందులకు రియాక్టు అవటంలేదు. చాలావరకైతే హోప్స్ లేవు. ఇంకొన్ని రోజులుంచండి, చూద్దాం" అన్నాడు. అతని మాటల్లో ఏమాత్రం ఆశ కన్పించలేదు. నిరాశగా బయటకు వస్తున్న నన్ను ఆసుపత్రి ఆయా పక్కకు పిలిచి, "నా మాటిని అమ్మాయిని ఇంటికి తీసుకుని పోండి. వీళ్ళు డిస్చార్జి చెయ్యరు. అమ్మాయిని బతికించనూ లేరు. ఎవ్వరికీ చెప్పా పెట్టాకుండా గమ్మున తీసుకుని వెళ్ళిపోండి. అనాధలా కాకుండా, పిల్లాడ్ని చూసుకుంటూ, అయినవాళ్ళమధ్య చావనియ్యండి" అన్నది. ఆ మాటలు విన్నాక నేను, మా నాయిన, మా అన్నయ్య, కరీముల్లా చెన్నయ్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఒక పెద్ద రావిచెట్టు కింద కూర్చుని గుప్పుగుప్పున బీడీలు, సిగరెట్లు తెగ తాగేసి, మా శక్తి మేరకు ఆలోచన చేసుకుని, అమ్మాయిని తీసుకుని బయలుదేరినాము. బయలుదేరేముందు ఆయా కరీమున్‌తో అన్న మాటలు నా చెవిన పడ్డాయి.

"పాపా! దేవుడు నీకు అన్యాయం చేసాడు. నీ గుండెకు పెద్ద బొక్కుందని ఒక డాక్టరు, ఇంకేదో మాయదారి రోగమని ఇంకో డాక్టరు అంటున్నారు. ఏది ఏమైనా నువ్వు ఏ క్షణంలో అయినా ఆ మురుగన్ దగ్గరికి వెళ్ళిపోయేదానివే. ఉన్నంతకాలం గుండె నిబ్బరం చేసుకుని బతుకు." అది విన్న కర్రి కంటి నుంచి ఒక కన్నీటిచుక్క రాలిపడింది. ఇదంతా వాళ్ళకు కన్పించకుండా విన్నాను. మా చెల్లెలుకు చెప్పే ధైర్యం మాకెవ్వరికీ లేనందున, మంచి పనే జరిగిందిలే అనుకున్నాను. నేను పోవటంతో ఆ నర్సు వెళ్ళిపోయింది. కరీమున్ నాతో ఎంతో బలహీనమై గొంతుకతో "భయ్యా! నాకేదో భయం భయంగున్నది. నాకేమన్నా అయితే కరీముల్లా ఉండలేడు. ఎటన్నా ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. లేదంటే జమాతుల్లో తిరుగు తుంటాడు. ఫయాజ్ ఆలనాపాలనా, చదువు సంధ్యలు, ముద్దుముచ్చట ఎవరు చూస్తారు. వాళ్ళకు నా అవసరం ఎంతో ఉంది. వాళ్ళిద్దరికీ నేనంటే ప్రాణం. నాకూ వాళ్ళను చూస్తేనే చాలు ఏ జన్నతూ వద్దు అనిపిస్తుంది. నాకు ఇప్పుడిప్పుడే చనిపోవాలని లేదు. ఇంకా బతకాలని ఉంది." ఆమె మాటలు విని నా గుండె ద్రవించిపోయింది. అక్కడ ఉండలేక నుదుటి మీద ఒక ముద్దు పెట్టుకుని గబగబ బైటకి నడిచాను.

చావు కనుచూపు మేరలో ఉందని తెలియటం విషాదం. ఆ పిల్లకు పాతిక సంవత్సరాలు కూడా సరిగ్గా నిండకపోవటం ఇంకా విషాదం. ఇంకా పాలు తాగటం విడిచిపెట్టని ఒక కొడుకు ఉండటం మహా విషాదం. ఆ బిడ్డకు పాలివ్వటం ప్రమాదమేమో అనే అనుమానం ఉండటం నరకం. ఒంటరిగా కొడుకుతో ఉన్న సమయాల్లో వాడితో కొన్ని మాటలు చెప్పుండేదట.

"ఒరేయ్! నేను లేకుంటే నువ్వు ఏడ్వకూడదు. ఎవరు దగ్గరకు తీసుకున్నా పోతుండాలి. ఎవరు ఏమి పెట్టినా వద్దనకుండా తింటుండాలి. అది కావాలి, ఇది కావాలి అని అనకూడదు. అదైతేనే తింటా, ఇదైతేనే తింటా అని అసలే అనకూడదు. నన్ను సతాయించినట్లు అన్నం తినేప్పుడు దొరక్కుండా ఉరుకుతూ పోయి ఇంకెవర్నీ సతాయించకూడదు." ఫయాజ్‌కు ఆ మాటలు అర్థంకావని, అంత వయస్సు వాడికి లేదనే స్పృహ కూడా ఆ పిల్లకు ఉండేది కాదు. మల్లెమొగ్గ పువ్వుగా వికసించి పరిమళాలు వెదజల్లకముందే రాలిపోయింది. కరీమున్ జీవితాన్ని అనుభవించకముందే చనిపోయింది. తల్లిదండ్రులంటే అత్తమామలంటే భయంభక్తి స్థానంలో, వయసుతో వచ్చే పెద్దరికపు స్వేచ్ఛ రాకమునుపే వెళ్ళిపోయింది. అన్నదమ్ములంటే, భర్తంటే ఒక దూరంతో కూడిన అనురాగం వీడి, ఒక చనువుతో కూడిన స్వేచ్ఛ రాకముందే వెళ్ళిపోయింది. పిల్లాడికి పాలు మాన్పించకముందే వెళ్ళిపోయింది. జీవితంలో ఆశ్చర్యంగా, కుతూహలంగా చూస్తూ ఉండిపోయే, వింటూ ఉండిపోయే, చెప్పిందల్లా చేస్తూ ఉండిపోయే ప్రేక్షక పాత్ర ముగియకముందే వెళ్ళిపోయింది. దేవుడు అన్నీ ఇచ్చినట్టే ఇచ్చి ఏదీ అనుభవించకముందే తిరిగి రప్పించుకున్నాడు.

***


ఆ పిల్ల జనాజాజులుస్ నా లోపట చిత్రం మాదిరి ఇప్పటికీ అలానే ఉంది. కొత్తపట్నం ఊరు ఊరంతా జనాజాతో కరీమున్ ఇంటి నుంచి కదిలింది. లా ఇలాహ ఇల్లల్లా... మహమ్మద్ రసూవిల్లా అనుకుంటూ, ఏడ్సుకుంటూ, భుజాలు మార్చుకుంటూ బయలుదేరింది. "ఖబరస్తాన్‌లో చివరిచూపు చూస్తాడు. ఫయాజ్‌ను కూడా జనాజాతోపాటు తీసుకుని రా" అన్నాడు మా అన్నయ్య మా తమ్ముడితో. మా ఆడోళ్ళంతా ఇంటికాడ్నే శోకాలు పెట్టుకుంటూ ఉండిపోయారు. వేరే కులాల ఆడోళ్ళంతా జనాజా వెనగ్గా ఆ బజారు చివరాకరు దాకా వచ్చి వెనక్కు మళ్ళి వెళ్ళిపోయారు. పోతూపోతూ ఒక పెద్దావిడ "పెద్దమ్మా, వదినా, అత్తమ్మా అని ఎంత ఆప్యాయంగా పలకరిస్తదో. ఎంత మంచి పిల్లో. టమాటాల గంపలోంచి మంచి వాటినే మనం ఏరుకున్నట్లు, ఆ దేవుడూ మంచి మంచోళ్ళనే

ముందు ముందుగా లాగేసుకుంటాడు." అంటున్నది. జనాజా మశీదు చేరాక మా బావ కరీముల్లానే జనాజా నమాజ్ చదివించాడు. నమాజు మధ్యలో సూరాలు చదవలేకపోయాడు. ఎక్కిఎక్కి ఏడ్చాడు. ఏడుస్తూ ఏడుస్తూ తనను తనే సముదాయించుకుంటూ నమాజు పూర్తిచేసాడు. అక్కడ్నించి జనాజాను ఖబరస్తాన్‌కు తీసుకుపోయాము. ముందుగానే గొయ్యి తవ్వి సిద్ధంగా ఉంది. ఆ ఇసుక నేలలో ఇసుక వేస్తే రాలనంత మంది జనం ఖబర్ చుట్టూ నిలబడ్డారు. కఫన్‌లోని కరీమున్ పీనుగ ఉన్న ఆ తెల్లని మూటను ఖబర్‌లోకి దిగి పట్టుకున్నాము. చాలా చిన్న గొయ్యి. ఆ పిల్ల ఎంతని, పిచ్చుకంత. గుంతలో నేనూ, మా తమ్ముడు దిగి మా చెల్లెలిని జాగ్రత్తగా ఆ ఇసుక మట్టిలో పడుకోబెట్టాము. ముఖం మీది కఫన్ బుట్టను తొలగించి అందరం చివరిసారిగా చూసుకున్నాం. ఏమి జరుగు తున్నదో అర్థం కాక, అందరూ ఎందుకు దుఃఖిస్తున్నారో తెలియక ఫయాజ్ బిక్కమొఖం వేసుకుని చూస్తున్నాడు. వాడికి వాడి తల్లి ముఖాన్ని దగ్గరగా రప్పించి చూపించాం. అందరం ఒక్కసారిగా పెద్దగా ఏడుస్తుంటే వాడు భయపడిపోయి అమ్మీ... అమ్మీ... అమ్మీ...అని మూడుసార్లు పిలిచాక వాడిని మా తమ్ముడు గుంతలో నుంచి బయటకు వచ్చి ఎటో ఎత్తుకుని వెళ్ళిపోయాడు. తలా గుప్పెడు పూలు, ఇంత ఇసుకను గొయ్యిలో వేసాము. చీరాల సముద్ర తీరాన ఇసుక భూమిలో పుట్టిన కరీమున్ కొత్త పట్నపు సముద్రతీరపు ఇసుక భూమిలో శాశ్వతంగా సమాధి అయిపోయింది. మట్టికొచ్చిన మంది మారు మాటలేకుండా ఎంతో వైరాగ్య వదనంతో వెనుతిరిగి ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఆమె దేహం మాత్రం ఇసుక భూమిలో కప్పబడిపోయింది. అల్లా తాలాతో కర్రి కొరకు మా అమ్మ ప్రతి దువాలో కొట్లాడేది, వలవల ఏడుస్తూ వేడుకునేది.

"యా అల్లా! యే మేరీ పైగంబర్! మేరీ బేటీ కో బచాలో. ఇప్పటికే ఏ వందసార్లో మీ పేరు తీసుకుని ఖురాను మొత్తం చదివాను. ఇంకో వందసార్లు కూడా పూర్తి చేస్తాను. నా కూతుర్ని మాత్రం చంపబోకండి. అది చిన్న పిల్ల, దానికో చంటి పిల్లోడు. నా బిడ్డను, దాని బిడ్డను అన్యాయం చేయకండి. కావాలంటే నన్ను తీసుకోండి. దాన్ని మాత్రం వదిలేయండి. వదలకుంటే మాత్రం ఇంకెన్నడూ మీ జికర్ కూడా చేయను. ఖురానే చదవను. నమాజులు వదిలేస్తాను. పండగలు చెయ్యను. మీరు దయామయులు. ఆ పిల్లను కరుణించండి" అమ్మ ఎప్పుడూ ఇవే ప్రార్థనలు చేసేది.

"మామయ్యా! తొందరతొందరగా నడు. నానమ్మ మన కొరకు చూస్తుంటది. భోజనము చేసి సముద్రము దగ్గరకు కూడా పోదామన్నావు. మగరిబ్ తరువాత తొందరగా అమ్మకు ఇక్కడ కూడా ఊదు వేసాకనే, నూతలపాడుకు పోవాలి. అక్కడ అమ్మమ్మ కూడా మన కొరకు ఎదురుచూస్తుంటది. అక్కడ కూడా మనం ఊదు వేయాలి" అని నా మేనల్లుడు ఫయాజ్ మాటలు విన్పించేసరికి, ఆలోచనలు ఆపి, కర్రి ఖబర్ దగ్గరకు వడివడిగా నడిచాము. సమాధి చుట్టూ రాతి పలకలు పెట్టి, ఒక దీర్ఘ చతురస్రంలా ఉన్నది. తల భాగాన నల్లటి రాతిపలక మీద కరీమున్నీసాబేగమ్- జననం 1973- మరణం 1997 అని చెక్కి ఉంది. రాతి పలకల మధ్యలో చిన్నచిన్న పిచ్చిమొక్కలూ, ఇసుక మట్టి, చీమలు ఉన్నాయి.

ఫయాజ్ జేబీలో నుంచి ఒక ప్లాస్టిక్ సంచి తీసాడు. దానిలో వాడి నానమ్మ వాళ్ళింట్లోని కరీమున్ పెంచిన పూలమొక్కల్నుంచి తుంచిన పూలు పెట్టి ఇచ్చింది. వాటిలో గసాలు, చక్కెర కలిపింది.



"అది చిన్న పిల్ల, దానికో చంటి పిల్లోడు. నా బిడ్డను, దాని బిడ్డను అన్యాయం చేయకండి. కావాలంటే నన్ను తీసుకోండి. దాన్ని మాత్రం వదిలేయండి. వదలకుంటే మాత్రం ఇంకెన్నడూ మీ జికర్ కూడా చేయను. ఖురానే చదవను. నమాజులు వదిలేస్తాను. పండగలు చెయ్యను. మీరు దయామయులు. ఆ పిల్లను కరుణించండి" అమ్మ ఎప్పుడూ ఇవే ప్రార్థనలు చేసేది.

గసాలు, చక్కెర కలిపిన పూలరేకుల్ని ఫయాజ్, నేను కొన్నికొన్ని తీసుకుని కర్రి ఖబర్ మీద చల్లినాము. దాని పక్కనే ఉన్న కరీముల్లా ఖబర్ మీద కూడా కొన్ని చల్లినాము. ప్రతి రంజాన్, బడోంకి ఈద్, షాబాన్ పండగలకు ఫయాజ్ వచ్చి అవి చల్లి దురూద్ చదివి, కొంచెంసేపు కూర్చుని పోతుంటాడు. వాళ్ళ నాయిన బతికున్నంత కాలం ఆయనతో వచ్చేవాడు. తరువాత ఒంటరిగా వస్తున్నాడు. కర్రి చనిపోయాక ఆ మనాదితో కరీముల్లా కూడా చనిపోయాడు. ముస్లిములంతా పండగలకు ఈద్గా ఖుద్బా నుంచి ఖబరస్తాన్‌కు తప్పక వస్తుంటారు. గతించిన వారి షాబాన్, బడోంకి ఈద్ పండగలకు తప్పనిసరిగా వస్తారు. పూర్వీకులన్నా, ఖబర్‌లన్నా ముస్లిములకు ఎంతో పవిత్ర భావం. ఇస్లాంలో ఒక్కటే జీవితం. చనిపోయాక ఆఖరియత్ వరకు ఆ ఆత్మలు ఈ పండగలకు తమతమ ఇండ్లకు వచ్చి చూసుకుని పోతుంటాయని ఇస్లాం నమ్మకము. కర్రి చనిపోతానని తెలిసాక ఒక సంవత్సర కాలం బతికింది. ఆ సమయంలో ఎంత భయపడిపోయిందో, ఏమేమి ఆలోచించుకున్నదో ఆ అల్లాతాలాకే తెలియాలి. లేదా ఆ పూలమొక్కలకే తెలియాలి. వారానికి ఒక పూలమొక్క చొప్పున ఏడు వారాలు ఏడు మొక్కల్ని నాటింది. వాటికి ఫయాజ్, మేరాజ్, రొఖియా, కరీముల్లా, జుగ్ని, అత్తమ్మ, మామయ్య అని పేర్లు పెట్టుకుంది. కొడుకు, మేనల్లుడు, తల్లి, భర్త, తండ్రి, అత్తమామల పేర్లు పెట్టుకుని రోజూ వాటికి నీళ్ళుపోసి, శ్రద్ధగా పెంచుకున్నది.ఎవరూ లేనప్పుడు చూసి వాటితో మాట్లాడేది. తనకు తెలిసిపోయిన తన చావు విషయము ఇతరులకు తెలియనివ్వకూడదనుకుంది. మేము కూడా అలానే అనుకుని ఆమెతో చెప్పలేదు. అది ఆమెలో ఇంకొంత ఒత్తిడిని పెంచింది. దుఃఖాన్ని ఎవరితోనన్నా పంచుకుంటే తగ్గిపోతుంది కాబట్టి, ఆ పూలమొక్కలతో చెప్పుకునేది. వాటి పూలు ఈమె మాటలు విని బాధగా ఊగేవి.

ఈ ఆలోచనలతో లంచ్ సమయమూ దాటిపోయింది. అన్నం కొరకు ఇంటికి పోవాలనిపించలేదు. బజారు సెంటర్లోనే ఓ రెండు అరటిపండ్లు తిని చెక్కబండి రిక్షా ఎక్కి చుట్టూ ప్రకృతిని చూసుకుంటూ సముద్రం దగ్గరికి పోయాం. దరువులు, ఉప్పుమడులు, ఆకుపచ్చని వరినారు చూసుకుంటూ పల్లెపాలెం గ్రామ దేవత గుడిని దాటి దరియా చేరుకున్నాము. సముద్రాన్ని చూడంగానే కర్రితో అక్కడి ప్రకృతిలో తిరిగిన జ్ఞాపకాలు అలుముకున్నాయి.

ఒకసారి కొత్తపట్నం సముద్రం నుంచి దగ్గరి దారిలో తోటల్లో నుంచి, పొలాల్లోనుంచి మా కరీమున్ ఇంటికి వచ్చాము. నాతోపాటు కరీమున్, కరీముల్లా ఉన్నారు. ఆ సాయం సమయం ఆ సబుకు తోటల్ని, ఆ కొబ్బరి తోటల్ని చూస్తూ నడిచాం. చేలగట్ల మీద, పొలాల మధ్యమధ్యలో బంతిపూలు, చేమంతిపూలు ఎంతెంత అందంగా, ఎన్నెన్ని రంగుల్లో ఉన్నాయో. పొలాల, తోటల మధ్యలో రాత్రుళ్ళ కాపలా పడుకోవటానికి రైతులు చిన్నచిన్న గుడిసెలు వేసుకుని ఉన్నారు. రాత్రుళ్ళ వాళ్ళ ఆ గుడిసెల్లో పడుకుంటారనే భావనే నాకు ఎంత థ్రిల్లింగ్‌గా అనిపించిందో. మా కర్రి కరీముల్లాలు కూడా ఆ ప్లజంట్ వాతావరణంలో తన్మయంగా ఏదో మాట్లాడుకుంటూ నా ఆనందాన్ని ఆశ్చర్యాన్ని వింతగా చూస్తూ నడుస్తున్నారు. సముద్రంలో సూర్యాస్తమయాన్ని ఎనకెనక్కి దౌడు తీస్తూ చూస్తూ దబుక్కున ఎల్లికిలా పడిపోయాను. "అరెరెరె... అయ్యయ్యయో... ఎందకన్నయ్యా ఇసుకలో ఎనక పరుగు. మీ రేగటి మట్టోల్లకు, పడమటోల్లకు సరిగ్గా నడవటమే రాదు కద" పిర్రలకు, వీపుకు అంటిన ఇసుకను దులుపు కుంటున్న నా వైపు చూస్తూ కర్రి వేళాకోళమాడింది. కర్రి జోగ్గా మాట్లాడటం నేను చూడటం అదే మొదటిసారి, చివరిసారి కూడా. ఆ సన్నివేశం

నా జ్ఞాపకాల్లో ఒక దివ్యానుభవం. అప్పట్లోనే మేము ముగ్గుర్ం ఒక రోజు ఆటోలో ఆ చుట్టు పక్కల ప్రాంతమంతా తిరిగాము. మన్నూర్ సముద్రతీరం, అక్కడి శివాలయం ముంగటి పెద్ద పాత రథం, తిర్నాల, తీటపురం పూలతోటలు అద్భుతం. మోటుమాల, గుండమాలల నుంచి గుండ్లకమ్మ నదిలో పడవలో ప్రయాణించి సముద్రం కలిసేచోటకు పోయి ఆ ఒడ్డున తిరగటం మహా అద్భుతం. మా చెల్లి చేసిన అక్కడి గోంగూర సముద్రపు పచ్చి రొయ్యలు కలిపి వండిన కూర ఆ ఒడ్డున తినటం మరచిపోలేను. వేపుడు చేసిన సముద్రం చేపను చాక్‌లెట్ మాదిరి చేతిలో పట్టుకుని ఫయాజ్ తింటూ తిరగటం చూడముచ్చటగా కనిపించేది. నా లోపటి ఈ అద్భుతాలన్నిటినీ కర్రి చావు మింగేసింది, సముద్రం ఎన్నో నదుల్ని మింగేసినట్లు. తప్పు చేయకపోయినా మారు మాట్లాడకపోయేది. భయం భయంగా ప్రేమ ప్రేమగా మసిలేది. ఎంత కష్టమైనా భరించేది. నోరు విప్పకపోయేది. చనిపోతున్నానని తెలిసిన తరువాత జీవితంతో విసుగువిసుగు అనిపిస్తున్నప్పుడు కూడా, ఎవరి దగ్గిరా చికాకును ప్రదర్శించలేదు. పిల్లలంటే ఇలా ఉండాలనే తల్లిదండ్రుల రూపమే కరీమున్. చెల్లెలంటే ఇలా ఉండాలనే అన్నదమ్ముల రూపమే కరీమున్. కోడలంటే ఇలా ఉండాలనే అత్తమామల రూపమే కరీమున్.

***

చనిపోయినోళ్ళను పెద్దోళ్ళలో జమకడ్తారు. పెద్దల పండక్కు వారిని పేరుపేరున ఫాతియాల్లో చేర్చి చదువుతారు. వాళ్ళ ఆత్మలు ఆ రోజు వారివారి ఇండ్లకు వచ్చి చూసుకుని పోతాయట. అందుకని ఇంట్లో పెద్దవాళ్ళు వాళ్ళ ఆత్మకు శాంతి చేకూరాలని తబక్ ఉంచి ఊదు వేస్తూ దువా చేస్తారు. మా ఇంట్లో ఇదంతా మా అమ్మనే చేస్తుంది. ఆ రోజంతా అమ్మ అందరినీ తలుచు కుంటూ దిగులుతో ఏడుస్తూనే ఉంటుంది. ఎంతో శ్రద్ధగా తబక్‌ను సమకూరుస్తుంది. మా నాయిన కొరకు బీడీకట్ట, అగ్గిపెట్టెను, మా తాతకొరకు పొగాకు కాడను, మా అమ్మమ్మ కొరకు నస్యండబ్బీని, మా చెల్లెలు కొరకు పట్టు పరికిణీ, రైల్లల్లో అమ్మే నిమ్మబద్దల్ని పెడుతుంది. పలావు, మేకమాంసంకూరతోపాటు ఇవన్నీపెట్టి ఫాతియాలు చదివి, దువా చేస్తుంది. నమాజు, ఖురాను చదివినందువలన వచ్చిన సవాబ్‌ను చనిపోయినవారికి చేర్చమని వేడుకుంటుంది. మమ్మల్ని పిలిచి ఊద్దాన్‌కు సలాంచేసి సాంబ్రాణి నిప్పుల మీద వేయమంటుంది. దువాలో ముందుగా పైగంబర్ పేరుతో మొదలుపెట్టి మా వంశంలోని, కుటుంబంలోని చనిపోయినవా రందరి పేర్లను తలచుకుని సాంబ్రాణి వేస్తుంది. మా చేత వేయిస్తుంది. ఇదంతా అయ్యాక తబక్ అలానే ఉంచి తలుపు కొంచెం తెరచి అందరూ వచ్చి బయట కూర్చుంటాం. ఆ సమయంలో చనిపోయినవారు వచ్చి చూసుకుని, తినిపోతారని ఆమె నమ్మేది. ఫయాజ్ నేను అక్కడ కొత్త పట్నంలో ఊదువేసి, వెంటనే బస్సెక్కి సరియైన సమయానికే ఇక్కడకు వచ్చి ఊదు వేసాము. కర్రిని తలచుకున్నాము. ఆ నిప్పుల మీది నుసిని తీసి మా అమ్మ నాకు, ఫయాజ్‌కు కణతలకు రాసింది. అప్పుడుగాని నా మనస్సు స్థిమితపడలేదు. తెలుగోల్లు కూడ పెద్దర్ల అమావాస్యనాడు పెద్దలకు బియ్యం పోస్తారు. పండ్లు ఫలాలు తలిగె అనో నైవేద్యం అనో తబక్‌లాగా పెట్టి బొందల గడ్డకు పోయి దండం పెట్టుకుని వస్తారు. ఆ ఫాతియాలిచ్చిన తబక్‌లో నుంచి కొంతకొంత మా అన్నంలో కలుపుకుని తృప్తిగా తిని మంచం మీద వాలాను. కర్రి నవ్వు ముఖాన్ని తలుచుకుంటూ హాయిగా కండ్లు మూసుకున్నాను.

***

కరీమున్ పొద్దస్తమానం నవ్వుతూ ఉండేది. అయినా మేఘం కదులుతున్న నవ్వడే. కదిలితే నవ్వేది. కదిలిస్తే నవ్వేది. నుంచుంటే నవ్వేది. కూచుంటే నవ్వేది. నవ్వితే నవ్వేది. పలకరిస్తే నవ్వేది. కరిమంటేనే నవ్వనుకునే వాళ్ళం. ఆడపిల్లవి నవ్వకూడదంటే నవ్వేది. మా అమ్మమ్మ నవ్వొద్దని తిట్టినా నవ్వేది. మా అమ్మ నవ్వొద్దని కొట్టినా నవ్వేది. సమయం, సందర్భం మహా గంభీరమైనా నవ్వేది. మా ఊరి చెర్వు అలుగుల్లా మా కర్రి నవ్వులు జలపాతం జారుతున్నట్లు, నక్షత్రాలు మెరుస్తున్నట్లు, మల్లెపూలు కురుస్తున్నట్లు నవ్వేది. నవ్వినప్పటి బుగ్గన సొట్ట చాంద్ కొసంటి వెలిగే వీనస్‌లా ఉండేది. నా చెల్లెలు కరీమున్నిసా పగలబడి నవ్వుతుంటే, వెన్నెల్లో విహరించే పున్నమి చందమామ అమాస చీకటి అయిపోయేది. సూర్యకిరణాలు పడి కొలను నీరు నక్షత్రాలు మెరుస్తున్నట్లు అనిపించేది. రంగురంగుల్లో పువ్వులు వికసించి అల్లాతాలాను మనకు చూపిస్తాయి, కరిమ నవ్వులో ఖుదా కన్పించినట్లు. ఎక్కడ చూడు ఎప్పుడు చూడు నవ్వుతూనే ఉండేది. నవ్వును ఆపటం ఆమె వశమయ్యేది కాదు. నవ్వకుంట ఎంత బిగబడితే ఆమెకు అంతకంత చక్కిలిగింతలా అయ్యేది. కానీ పెద్దలు తిడుతారని భయపడేది. పిచ్చిపిల్ల అనుకుంటారని భయపడేది. అందుకే అప్పుడప్పుడు వంటింట్లోకో, స్నానాలగదిలోకో ఉరికి, కనిపించకుండా, నవ్వు వినిపించకుండా నవ్వేది. పదిమంది మధ్య నుంటే గజగజ వణికిపోయేది, ఎప్పుడు అకస్మాత్తుగా విరగబడి నవ్వేస్తదోనని. అలా నవ్వి నవ్వి అల్లాకో ప్యారీ బనీ. జిందగి భర్‌కి హాసీ పచ్చీస్ సాల్ మే హస్‌హస్‌కే మురీ. యధేచ్ఛగా నవ్వనన్నా నవ్వనీయకపోతిమి. నవ్వునవ్వుకు అడ్డుకట్ట లేస్తిమి. పాతికేళ్ళే నవ్వి వందేళ్ళు మమ్మల్ని నవ్వకుండా చేసింది. ఎక్కడ ఎవరు నవ్వుకుంటున్నా, మేమెప్పుడూ నవ్వుకున్నా కరీమున్ నవ్వు జ్ఞాపకం వస్తుంటది. కరీమున్ ఒక నవ్వు. నవ్వు విషాదం ఎట్లయితది. అదొక దివ్యానుభూతి. కరీమున్ ఏక్ ప్యారీ హాసీ. హమేషా హమారీ యాద్ రహేగీ.

●

5

## నా రాధకు...



కనిపించే కొండలు
పైన నీలాకాశం
విహరించే మేఘాలు
మెరిసే నక్షత్రాలు
ఉప్పొంగే సంద్రాలు...
ఇవేవీ రావు నేను పిలిస్తే,
పిలవకనే వస్తుంది మురిపెంగా నా రాధ,
అదే మా అనుబంధం
అది చాలు నా జన్మకు-

***

పువ్వులు లేకుంటే
పరిమళాలు లేవు,
హరివిల్లు లేకుంటే
సప్తవర్ణాలు లేవు,
సూర్యచంద్రులు లేకుంటే
వెలుతురే లేదు.,
నేనూ, నా రాధ లేకుంటే
ప్రేమ లోకం లేనేలేదు-

***

చెట్టు కొమ్మల్లో నేను
కొలను ఒడిలో రాధ,
మురళీగానం కలిపింది
మా ఇద్దరిని-

– చల్లా రామక్రిష్ణారెడ్డి

